

ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాళం వేసిన ఇంట్లో అగ్ని ప్రమాదం

- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 30: తాళం వేసిన ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న రాజు ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి బట్టలు, నిత్యావసర వస్తువులు, ఇంటి పైకప్పుతో పాటు దాచుకున్న డబ్బులు కూడా కాలి బూడిదయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపుచేశారు. దీంతో కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. పార్టీ నాయకుల ద్వారా తక్షణ నగదు సాయం అందించడంతోపాటు నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా బాధితులతో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డితోపాటు నాయకుడు పాల సాయిరామ్ మాట్లాడారు. అధైర్య పడవద్దని ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అండగా ఉంటారని వారికి ధైర్యం చెప్పారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు రాములు, భూపేశ్, కనకరాజు, సాయి ప్రేమ్, రాజు, నరేశ్, ఆకాశ్ ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి

హుస్నాబాద్ ఎమ్మెల్సీ భవనం ఎదుట నల్లబ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

తొగుటలో మానవ వనరుల కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

హుస్నాబాద్, నవంబర్ 30: సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా ఏండ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోపించారు. శనివారం హుస్నాబాద్‌లోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి అసెంబ్లీ ఎన్నికలకు ముందు హనుమకొండలో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న ఆందోళన వద్దకు వచ్చి తాము అధికారంలోకి వస్తే రెగ్యులైజ్ చేస్తామని, లేకుంటే పేస్కేల్ అమలు చేసామని హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని విస్మరించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా తమ గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న విద్యాశాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తామని, సకాలంలో స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెకు దిగడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజశేఖర్, సంజయ్, స్వామి, స్వప్న, రేణుక, యాదగిరి, కేజీబీవీ పీఆర్టీలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

తొగుట, నవంబర్ 30: కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు టి.రాజు ఆరోపించారు.తొగుట మానవనరుల కార్యాలయం ఎదుట శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి,సీఆర్‌టీలు స్వర్ణలత,అనురాధ,ప్రియాంక, క్లస్టర్ స్థాయిలో సీఆర్‌పీలు వెంకటస్వామి, బాలకృష్ణ, స్వర్ణలత, పీటీఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ప్రాజెక్టులు ఎంపిక

గజ్వేల్, నవంబర్ 30: మండలంలోని అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అద్భుతంగా ప్రాజెక్టును ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం సుగుణాకర్ తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు హఫీజ్ పర్యవేక్షణలో విద్యార్థి ఎస్.వికాస్ రూపొందించిన మ్యాట్రిస్ క్లినర్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాఠశాల నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక కావడంపై విద్యార్థి వికాస్, గైడ్ హఫీజ్‌ను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం అభినందించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన అహ్మదీపూర్ విద్యార్థి ప్రాజెక్టు

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు సెయింట్ మేరీస్ విద్యార్థి ప్రాజెక్టు

ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన సీబీఎస్ఈ పదోతరగతి విద్యార్థిని జూపల్లి మనస్విని ప్యాడీ హార్వెస్టర్ అండ్ డ్రయర్‌పై చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇన్నా రెడ్డి తెలిపారు.

మల్లన్న ఆలయంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం

చేర్యాల, నవంబర్ 30: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ఆలయానికి సంబంధించిన వివిధ అంశాలకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ఆలయ ఈవో ఎ.బాలాజీ ఆధ్వర్యంలో జరిగింది. ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద కొబ్బరికాయలు అమ్ముకునే లైసెన్స్ హక్కులను గీస భిక్షపతి అనే వ్యక్తి రూ. 15,10,000 గరిష్టంగా పాట పాడి దక్కించుకున్నాడు. జాకీటు పీసులు సరఫరా హక్కులను వరంగల్‌కు చెందిన అనంతుల కేదారి క్లాత్ మర్చంట్ నిర్వాహకులు రూ. 19.89 పైసలకు టెండరు వేసి లైసెన్స్ దక్కించుకున్నారు.పట్నాల తెల్లబట్ట సరఫరా చేసే హక్కులను రూ.3.24పైసలకు వేసి హక్కులు, ఓం నమఃశివాయ శెల్లాలు సరఫరా హక్కులను రూ.44.55 పైసలకు, జరీ శెల్లాలు సరఫరా హక్కులను రూ.11.88 పైసలకు టెండరు వేసి భువనగిరికి చెందిన భూపాల్‌రెడ్డి అనే వ్యక్తి దక్కించుకున్నారు. దేవాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల్లో తాత్కాలిక లైసెన్స్ పద్ధతిపై వ్యాపారం చేసుకునే హక్కుల కోసం నిర్వహించిన టెండరులో ఒక్కరే పాల్గొనడంతో ఆ టెండర్‌ను ఆలయ ఈవో వాయిదా వేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

చేర్యాల, నవంబర్ 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆపార్టీ మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ అన్నారు. డిసెంబర్ 1,2వ తేదీల్లో గజ్వేల్ పట్టణంలో జరిగే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో శభాష్‌గూడెం, నాగపురి, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, కడవేర్గు గ్రామాల్లో శనివారం సమావేశాలు నిర్వహించి ఆయన సభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టాయని ఆరోపించారు. మహాసభలకు కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశాల్లో నాయకులు నాగపురి కనకయ్య, మోకు దేవేందర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శులు దండ్ల రమేశ్, గందాళ బాలు, దాసరి కనకయ్య, బొడ్డు ప్రకాశ్, బండకింది సంపత్, కొమురవెల్లి, గర్నెపల్లి చంద్రం, కత్తుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలిరావాలని ప్రచారం చేస్తున్న అరుణ్‌కుమార్

విద్యాసంస్థలు బంద్

సిద్దిపేట, నవంబర్ 30: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేటలో శనివారం వామపక్ష విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు విడుదల చేయాలని కోరారు. పట్టణ నాయకులు ప్రవీణ్, అరుణ్, అజయ్, నవదీప్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్, నవంబర్ 30: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థల్లో చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చాయి. పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ చేశారు. గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, నవంబర్ 30 : గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన గురుకులాల బంద్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్ మాట్లాడారు. విద్యార్థి సంఘాల నాయకులు రాహుల్, రవితేజ, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బెజ్జంకిలో

బెజ్జంకి, నవంబర్ 30: మండల కేంద్రంలోని బాలుర, బాలికల, మోడల్ స్కూల్‌ను ఏఐఎస్ఎఫ్ నాయకులు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పౌరుల హక్కులకు విఘాతం కల్పిస్తే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 30: పౌరుల హక్కులకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మద్దూరు ఏఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక దురాచారాలను పాటించరాదన్నారు. ప్రజలంతా సమానమేనన్న భావనతో ప్రతి ఒక్కరూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఎస్సై విజయ్‌కుమార్

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 30: మద్దూరులోని రామాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కస్తూర్బా పాఠశాలను సందర్శించిన అధికారులు

మద్దూరు (ధూళిమిట్ట), నవంబర్ 30: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శనివారం తహసీల్దార్ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, ఎంఈవో వరదరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రజితతో పాటు మండల అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను అధికారులు స్వయంగా రుచి చూశారు. పారిశుధ్యాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం నుంచి మురుగు బయటకు వెళ్లేందుకు అవకాశం లేక కొన్నాళ్లుగా మురుగు నిల్వ ఉంటున్న విషయాన్ని పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు అధికారుల బృందం హామీ ఇచ్చింది.

కస్తూర్బా పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న అధికారుల బృందం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 30: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్దూరు మండలంలోని రేబర్తి, వంగపల్లి, వల్లంపట్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, కరెంట్ సదుపాయం తదితర సౌకర్యాలపై ఆరా తీసినట్లు తెలిపారు. సౌకర్యాలు లేని కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో వీరరాజు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు,మాధవ్‌జాదవ్, కిరణ్ ఉన్నారు.

వంగపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

సోదరాభావంతో కలిసిమెలిసి ఉండాలి

అక్కన్నపేట, నవంబర్ 30: కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సోదరాభావంతో కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ అనంతరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గౌరవెల్లి దళితకాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కులం, మతం పేరుతో దూషిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయభాస్కర్, ఎంపీడీవో భానోతు జయరామ్, ఆర్ఐ యాదగిరి, ఎంపీవో మోహన్‌నాయక్, ఏపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

గౌరవెల్లిలో సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న తహసీల్దార్, ఎస్సై తదితరులు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

హుస్నాబాద్, నవంబర్ 30: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని హుస్నాబాద్ ఎస్సై తోట మహేశ్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం రాజ్యాంగం అనేక చట్టాలను తెచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై మహేశ్

ఆలయాల్లో కార్తిక దీపారాధన

వర్గల్, నవంబర్ 30: వర్గల్ విద్యాధరి సరస్వతీమాత ఆలయం, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయాలు శనివారం కార్తికమాసం పర్వదినం సందర్భంగా దీపకాంతుల వెలుగులతో ధగధగలాడాయి. పెద్దఎత్తున కల్యాణాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. విద్యాధరి క్షేత్రంలో తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి మూలవరులను దర్శించుకోగా, నాచగిరి దేవాలయంలో ఈవో అన్న పూర్ణ సతీసమేతంగా సత్యదేవుని వ్రతం ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

నాచగిరిలో సత్యదేవుడికి వ్రతాలు చేస్తున్న భక్తులు

నేడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి

సిద్దిపేట టౌన్,నవంబర్ 30 : మలిదశ తెలంగాణ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య15వ వర్ధంతిని సిద్దిపేటలో ఆదివారం నిర్వహిస్తామని తెలంగాణ పోలీస్ ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు.శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట అమరవీరుల స్తూపం నుంచి కిష్టయ్య విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నరసింహులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

గజ్వేల్, నవంబర్ 30: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు కోరారు. శనివారం మండలంలోని బెజుగామలో భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచార ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. భారత రాజ్యాంగం ద్వారానే అన్ని కులాల వారికి రాజకీయంగా అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కిందన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న వేణు

రెవెన్యూ డివిజన్ సాధనే జేఏసీ లక్ష్యం

చేర్యాల, నవంబర్ 30: జనగామ, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలు అభివృద్ధి చెందకముందే చేర్యాల అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, పాలకుల నిర్లక్ష్యంతో చేర్యాల మండల స్థాయికి పరిమితం కావడం బాధాకరమని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ డా.రామగల్ల పరమేశ్వర్ అన్నారు.జేఏసీ ఆధ్వర్యంలో శనివారం అంగడిబజారులో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చేర్యాలకు పూర్వవైభవం రావాలంటే డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయడమే మార్గమని, జేఏసీ చేస్తున్న పోరాటం రాజకీయాలు కాదని, ప్రజల వేదిక అన్నారు. అన్నివర్గాలు ఏకమై డివిజన్ సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జేఏసీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మెరుగు శ్రీనివాస్, అందె బీరయ్య, అందె అశోక్, కొమ్ము రవి, గిరి కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, కొమ్ము నర్సింగరావు, మహ్మద్ ఖాజా, దాసరి శ్రీకాంత్, మల్లిగారి యాదయ్య, ఆరుట్ల వినీత్, చందా శ్రీకాంత్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాలకు చెందిన జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

గజ్వేల్, నవంబర్ 30: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించిన అనంతరం ర్యాలీ తీశారు. శనివారం ఎన్ఎస్ఎస్, రెడ్ రిబన్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన మాట్లాడారు. ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, దానిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జయరాజు, కస్తూర్బా, రెడ్ రిబన్ క్లబ్ కో ఆర్డినేటర్ శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకురాలు

ఫిజిక్స్ అధ్యాపకురాలికి సన్మానం

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలు దొంతుల సుమలత భౌతిక శాస్త్రంలో చైతన్య డే టు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను డాక్టర్ సాత్విక్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కళాశాల అధ్యాపకులు ఆమెను సన్మానించి అభినందించారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

సిద్దిపేట టౌన్, నవంబర్ 30: ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి సూచించారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు భవనంలో వరల్డ్ ఎయిడ్స్‌డేను పురస్కరించుకొని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జిలు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లే, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, రమేశ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, యశోద దవాఖాన వైద్యుడు సందీప్ పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 30: మతిస్థిమితం లేక యువకుడు చెరువులో పడి మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెదిన పోతారం నవీన్ (30) దివ్యాగుడుకావడంతో మతి స్థిమితం లేక తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ నెల 29న వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. శనివారం గ్రామ శివారులోని రెడ్డివారి కుంటలో వెతుకగా నవీన్ మృతదేహం దొరికింది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 30: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని దళితసంఘాల జేఏసీ రాష్ట్రచైర్మన్ బత్తుల చంద్రమౌళి కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని బీసీహాస్టల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, హాస్టల్స్, గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థుల కోసం ఎస్సీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లోనే అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఇందు కోసం బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

బీసీహాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న బత్తుల చంద్రమౌళి

జగదేవపూర్‌లో..

జగదేవపూర్, నవంబర్ 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి మాధవరెడ్డి, ఎంపీవో ఖాజామోహినొద్దీన్, మెడికల్ ఆఫీసర్ సత్యప్రకాశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మాడల్ పాఠశాల, బాలికల హాస్టల్‌ను వారు సందర్శించారు. హాస్టల్ గది పరిసరాలు, బియ్యం, కూరగాయలు, వంటగదిని పరిశీలించారు విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఈసీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితుల్లో విభజన సరికాదు

చేర్యాల, నవంబర్ 30: జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని ఎక్కడా లేదని, దళితుల్లో విభజన తెచ్చే ప్రయత్నాలు చేయవద్దని మాల మహానాడు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ కోరారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలల జాతీయ ఐక్యత కోసం ఆదివారం హైదరాబాద్‌లో మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మాలలు భారీగా తరలివచ్చి ఐక్యత చాటుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మాలలకే కాదని, మాదిగలు, ఎస్టీలకు కూడా వ్యతిరేకంగ